క్లుప్తంగా

స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ తగదు



ధర్నా చేస్తున్న అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర నాయకులు గంటా పండు

దెందులూరు: విశాఖ ఉక్కు– ఆంధ్రుల హక్కు అని దశాబ్దాలుగా ఈ నినాదమే రాష్ట్ర ప్రజలందరి గుండెల్లో స్థిరంగాఉందని అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర నాయకులు గంటా పండు అన్నారు. బుధవారం శింగవరంవద్ద అంబేడ్కర్ యువజన సంఘం సభ్యులతో కలిసి ఆయన నిరసన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో మేధావులు, స్వచ్ఛందసంస్థలు, యువ జన సంఘాలు, మహిళా సంఘాలు, గిరిజన, అభ్యుదయ సంఘాలు ఏకమై స్టీల్ ప్లాంట్ పరిరక్షణకు ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు.

ఏపీ అండర్ 19 క్రికెట్ జట్టుకు తాతా సాయి ప్రకాష్



దెందులూరు: ఏపీ అండర్ -19 క్రికెట్ జట్టుకు తెలుగు తేజం తాతా సాయి ప్రకాష్ ఎంపిక కావడం తెలుగు ప్రజలందరికీ సంతోషకరమైన విషయమని బీసీ సంఘాల నేతలు ప్రజాప్రతినిధులు, సర్పంచ్‌లు పరసా లక్ష్మి సుజాత కనకరాజు, బైగాని వెంకటేశ్వరమ్మ శ్రీమన్నారాయణ తదితరులు అన్నారు. ఆంధ్రప్రదేశ్ తెలుగు తేజం గౌడ సంఘ సభ్యుడు తాతా సాయి ప్రకాష్ మరింత ఉన్నత స్థానాన్ని పొందాలని ఎన్నో విజయాలు రాష్ట్రానికి అందుకోవాలని ప్రజాప్రతినిధులు ఆకాంక్షించారు.

బీజేపీ ప్రభుత్వానికి బుద్ధిని ప్రసాదించాలని వినతి

భీమడోలు: బీజేపీ ప్రభుత్వం మతాల మధ్య చిచ్చు రేపుతోందని పలువురు వక్తలు అన్నారు. మహాత్మగాంధీ జయంతిని పురస్కరించుకుని మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం భీమడోలులోని గాంధీ బొమ్మ సెంటర్‌లో గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు యర్రంశెట్టి ఏడుకొండలు, పెద్దిరెడ్డి సుబ్బారావు తదితరులు గాంధీజీ విగ్రహానికి వినతిపత్రం అందించారు.

గ్రామాభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలి

ఏలూరు రూరల్: ప్రణాళికల రూపకల్పనతో గ్రామాల అభివృద్ధి మరింత మెరుగవుతుందని ఈఓపీఆర్డీ ఎం సరళకుమారి అన్నారు. ప్రభుత్వం ఆదేశాల మేరకు బుధవారం ఏలూరు రూరల్ మండలం గుడివాకలంక, మల్కాపురం, శ్రీపర్రు, పెదయాగనమిల్లి, కోమటిలంక తదితర గ్రామాల్లో ఉపాధి హామీ పథకం అధికారులు, సిబ్బంది ప్రత్యేక గ్రామ సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎన్ఆర్ఈజీఎస్ ఈసీ విజయ్ మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామాల్లో అనేక అభివృద్ధి పనులు చేపట్టవచ్చన్నారు. ఇందు కోసం 2024–2025 సంవత్సరంలో చేపట్టనున్న పనులపై ప్రజలు, పెద్దలు, ప్రజాప్రతినిధుల అభిప్రాయాలు తెలుసుకునేందుకు గ్రామ సభలు నిర్వహిస్తున్నామన్నారు. అధికారులు ప్రత్యేక గ్రామ సభలు నిర్వహించారు.

రైతు ఫీల్డ్ బుక్ ఆవిష్కరణ

ఏలూరు(మెట్రో): మహాత్మాగాంధీ జయంతి సందర్భంగా జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రచురించిన ఉద్యానవన పంటల పెంపకం -2024–25 ఆర్థిక సంవత్సరంలో సన్న, చిన్నకారు రైతులకు ప్రభుత్వం అందించే రాయితీ, ఆర్థిక ప్రోత్సాహంపై ప్రచురించిన రైతు ఫీల్డ్ బుక్‌ను కలెక్టర్ కె. వెట్రిసెల్వి ఆవిష్కరించారు. బుధవారం స్థానిక కలెక్టరేట్ గౌతమీ సమావేశ హాల్లో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ ఉద్యాన పంటలకు ప్రభుత్వం అందించే ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆయిల్‌పామ్ పంటకు ఉపాధిహామీ పథకం ద్వారా మొత్తం మూడేళ్లకు కలిపి రూ.55,770 ఉద్యానశాఖ ద్వారా 60 మొక్కలకు సంబంధించి ఎరువులు, మొక్కలకు కలిపి మెటీరియల్ సబ్సిడీ ద్వారా రూ.28,860 చెల్లిస్తామన్నారు.

నేటి నుంచి దేవీ నవరాత్రి మహోత్సవాలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నగరంలో శ్రీ దేవీ నవరాత్రి మహోత్సవాలు ఈ నెల 3వ తేదీ నుంచి వైభవంగా ప్రారంభం కానున్నాయి. ఈ ఉత్సవాలను పురస్కరించుకుని ఇప్పటికే నగరంలోని పలు అమ్మవార్ల ఆలయాలు సర్వాంగ సుందరంగా రూపుదిద్దుకుంటున్నాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా అమ్మవార్లను బాలా త్రిపుర సుందరి, గాయత్రి దేవి, కాత్యాయని దేవి, మహాలక్ష్మీదేవి, లలితా త్రిపుర సుందరీ దేవి, మహా సరస్వతీ దేవి, రాజరాజేశ్వరీ దేవి, మహాదుర్గాదేవి, మహాకాళికా దేవిగా అలంకరించనున్నారు. పవర్‌పేటలోని కాశీ అన్నపూర్ణ సమేత విశ్వేశ్వర స్వామి దేవస్థానం, పవర్‌పేట వాసుదేవాలయం ప్రాంగణంలోని రాజ్యలక్ష్మీ దేవి దేవస్థానం, రామచంద్రరావు పేట మార్కండేయ వేద పాఠశాల, పత్తేబాద కనక దుర్గ ఆలయం, సత్రంపాడు సౌభాగ్యలక్ష్మి ఆలయం, దక్షిణపు వీధిలోని బాలాత్రిపుర సుందరి దేవి ఆలయాల్లో ఉత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు.

గాంధీ ఆశయ సాధనకు అందరూ పాటుపడాలి

- మాజీ ఎమ్మెల్యే వాసుబాబు
- వాడవాడలా ఘనంగా బాపూజీ జయంత్యుత్సవం

గణపవరం: గాంధీ మహాత్ముని ఆశయ సాధనకు అందరూ పాటుపడాలని, అహింసా మార్గంలో నడవాలని ఉంగుటూరు మాజీ ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. బుధవారం గాంధీ జయంతి సందర్భంగా వాసుబాబు క్యాంపు కార్యాలయంలో గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వాసుబాబు మాట్లాడుతూ గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యాన్ని గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రజలకు అందించిందని అన్నారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం గ్రామ స్వరాజ్యానికి తిలోదకాస్తోందని విమర్శించారు. గాంధీజీ జయంతి రోజున గ్రామగ్రామాన మద్యం అందుబాటులోకి తీసుకు రావడానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ దండు రాము, పార్టీ రాష్ట్ర సూర్య బలిజ విభాగం అధ్యక్షుడు శెట్టి రాజా, జిల్లా నాయకుడు మాదేటి సురేష్, మండల ఉపాధ్యక్షుడు సమయం వీరరాఘవులు, బువ్వనపల్లి వైస్‌సర్పంచ్ వెల్లంకి నరేష్, పార్టీ గ్రామ అధ్యక్షుడు కాన్వెంట్ శ్రీను, నాయకులు పాల్గొన్నారు.

గ్రామ స్వరాజ్య సాధనే మహాత్మునికి నివాళి

గణపవరం: అహింసే ఆయుధంగా బ్రిటిష్ వారిని గడగడ లాడించిన మహాత్మగాంధీ ఆశయ సాధనకు మన మంతా కృషి చేయాలని గణపవరం ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపల్ నిర్మల కుమారి అన్నారు. బుధవారం గాంధీ జయంతి సందర్భంగా ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో పదిహేను రోజులుగా నిర్వహిస్తున్న స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాల ముగింపు వేడుక నిర్వహించారు. ఈ సందర్భంగా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.



గణపవరం: క్యాంపు కార్యాలయంలో గాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే వాసుబాబు, పార్టీ నాయకులు

గాంధీ జయంతి సందర్భంగా బుధవారం మండలంలోని వివిధ గ్రామాల్లో మహాత్మునికి నివాళులర్పించారు. ఎ.గోపవరం, మొయ్యేరు, గణపవరం, పిప్పర, కొందేపాడు, కాశిపాడు, చిలకంపాడు వల్లూరు, జల్లికాకమ్మర గ్రామ పంచాయతీల్లో సర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామ ప్రముఖులు గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

బాపూజీ సేవలు చిరస్మరణీయం

దెందులూరు: జాతిపిత మహాత్మాగాంధీ చిరస్మరణీయుడని దెందులూరు మండల ఏపీఓ దశరదరామ్‌జీ, మండల సర్వేయర్ రమణారావు, డిప్యూటీ తహసీల్దార్ ప్రియదర్శిని అన్నారు. బుధవారం దెందులూరు ఎంపీడీఓ కార్యాలయంలో ఏపీఓ రామ్‌జీ, మండల సర్వేయర్ రమణరావు, కార్యాలయ సిబ్బంది మహాత్మ గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ ప్రియదర్శిని, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ హేమమాలిని, వీఆర్వోలు కిషోర్, రామకృష్ణ, శ్రీను, అనిరుధ్, విష్ణు, ప్రసాద్, రామచంద్రరావు, చంద్రం గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై కే. స్వామి, హెడ్‌కానిస్టేబుళ్లు, సిబ్బంది గాంధీజీ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. దెందులూరు బీఆర్‌డీ నర్సింగ్ కళాశాలలో గాంధీ జయంతిని పురస్కరించుకుని విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.



దెందులూరు: ఎంపీడీఓ కార్యాలయంలో గాంధీజీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అధికారులు



ఉంగుటూరు: స్వాతంత్య్ర సమరయోధుల వారసులను సత్కరిస్తున్న దృశ్యం

స్వాతంత్య్ర సమరయోధుల వారసులకు సత్కారం

ఉంగుటూరు: అహింసా మార్గాన్ని ప్రపంచానికి ఆచరించి చూపిన మహనీయుడు గాంధీ అని ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అన్నారు. బుధవారం ఉంగుటూరు సెంటర్లో గాంధీ విగ్రహం వద్ద గాంధీ జయంతి ఘనంగా నిర్వహించారు. ఏఎంసీ మాజీ చైర్మన్, గాంధీయ వాది కొండ్రెడ్డి సర్వేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. స్వాతంత్య్ర సమరయోధుడు తల్లప్రగడ నర్సింహ శర్మ వారసులు తల్లాప్రగడ భీమేశ్వరరావు, తయంబకం, శివరామ్ తదితరులను సత్కరించారు. సర్వేశ్వరరావు సమకాలికులు నలుగురికి నూతన వస్త్రాలు అందించి గౌరవించారు. ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి, సర్పంచి బండారు సింధు, మాజీ సర్పంచి దొంతంశెట్టి సత్యనారాయణ, ఏఎంసీ మాజీ చైర్మన్ పాతూరి విజయకుమార్, మాజీ జెడ్పీటీసీ చింతలవాసు, బీజేపీ నాయకురాలు అడపా శోభారాణి, ఉపసర్పంచి పాతూరి జగదీష్, కోరాడశివ, వంశీ, మంద జయలక్ష్మి, సూరత్తుల అయ్యప్ప, నారాయణ సత్తిపండు పాల్గొన్నారు.

గ్రామ స్వరాజ్య స్థాపనలో భాగస్వాములు కావాలి

భీమడోలు: బాపూజీ కలలు సాధనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని భీమడోలు మండల ప్రత్యేకాధికారి, బీసీ సంక్షేమ శాఖ జిల్లా అధికారిణి ఆర్‌పీ నాగరాణి అన్నారు. మండలంలోని 13 గ్రామ పంచాయతీల్లో బుధవారం జాతిపిత మహాత్మాగాంధీ జయంతిని పురస్కరించుకుని చట్టబద్ధ గ్రామ సభలను నిర్వహించారు. భీమడోలు సర్పంచ్ పాము సునీతామాన్‌సింగ్, పోలసానిపల్లి సర్పంచ్ షేక్ రహీమాబేగం అధ్యక్షతన వహించారు. పోలసానిపల్లిలో అధికారులు, ప్రజాప్రతినిధులు గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారిణి ఆర్‌పీ నాగరాణి తదితరులు పారిశుద్ధ్య కార్మికులను సత్కరించారు. ఎంపీడీవో సీహెచ్ పద్మావతిదేవి, ఎంపీటీసీ అంబటి దేవి, ఈవోఆర్‌డీ సుందరి, గ్రామకార్యదర్శులు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి స్వచ్ఛతా హీ సేవ దోహదం

పెదవేగి : ప్రభుత్వ ఆదేశానుసారం సెప్టెంబర్ నెల 17వ తేదీ నుంచి అక్టోబర్ రెండవ తేదీ వరకు గ్రామాల్లో స్వచ్ఛతా హీ సేవలో భాగంగా ప్రతి సచివాలయంలో అనేక కార్యక్రమాలను నిర్వహించినట్టు పెదవేగి మండల ప్రత్యేక అధికారి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కె భాస్కర్ తెలిపారు. మండల కేంద్రమైన పెదవేగి సచివాలయంలో నిర్వహించిన గ్రామసభలో పాల్గొన్న ప్రత్యేక అధికారి మాట్లాడుతూ అక్టోబర్ రెండవ తేదీ గాంధీ జయంతి సందర్భంగా మండల వ్యాప్తంగా ఉన్న అన్ని సచివాలయాల్లో గ్రామ సభలను నిర్వహించామన్నారు. గ్రామ సభల ముఖ్య ఉద్దేశం పంచాయితీల అభివృద్ధికి ఉన్న అవకాశాల పరిశీలన, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా పనులను గుర్తించడానికి నిర్వహించినట్టు ఆయన తెలిపారు. గ్రామ సభ ప్రారంభానికి ముందు గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సభకు ముఖ్య అతిథిగా సర్పంచ్ తాతా శ్రీరామమూర్తి, ఎంపీడీవో శ్రీనివాస్, కార్యదర్శి ప్రసాద్, సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.



గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ప్రత్యేకాధికారి కె భాస్కర్, తదితరులు

దాతల సహకారం అభినందనీయం

భీమడోలు: దివ్యాంగుల అభివృద్ధికి దాతల సహకారం అభినందనీయమని పలువురు వక్తలు అన్నారు. గుండుగొలనులోని శ్రీవిఘ్నేశ్వర దివ్యాంగుల సేవా సమితి ఆధ్వర్యంలో బుధవారం 60 మంది దివ్యాంగులకు నెలవారీ వితరణ కార్యక్రమం నిర్వహించారు. దాతలు చీలమ సుబ్బారావు, మీనాకుమారి, చీమల చిన్నారావు, నాగమణి సన్నబియ్యాన్ని, రాయపల్లి సీతారాం, అరుణకుమారి వారికి పండ్లు అందించారు. దండు కాశీవిశ్వనాథరాజు భోజనాన్ని ఏర్పాటు చేశారు. అనంతరం సేవా సమితి సభ్యులు దాతలను దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. నిర్వాహకులు పేరిచర్ల శ్యామలరాజు, గేదెల శ్రీనివాసరావు, ఏ.సోములు, సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

గాంధీ శాంతి మార్గం ఆదర్శనీయం

ఉంగుటూరు: మహాత్మగాంధీ శాంతి మార్గం ఆదర్శనీయమని ఉపాధ్యాయులు అన్నారు. గాంధీ జయంతిని విద్యా సంస్థల్లో బుధవారం ఘనంగా నిర్వహించారు. బుధవారం నారాయణపురం మహాత్మాగాంధీ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. కళాశాల ప్రాంగణంలోని లాల్ బహదూర్ శాస్త్రి విగ్రహానికి పూర్వ విద్యార్థులు బొమ్మిడి అప్పారావు ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. కైకరం జెడ్పీ హైస్కూల్లో గాంధీ జయంతి సందర్భంగా హెచ్‌ఎం ప్రసాదరావు ఆధ్వర్యంలో విద్యార్థులు మొక్కలు నాటారు. నారాయనపురం వివేకనంద జిల్లా పరిషత్ హైస్కూల్లో హెచ్‌ఎం మీరాసాహెబ్ ఆధ్వర్యంలో గాంధీ జయంతి నిర్వహించారు.



కైకరం హైస్కూల్లో మొక్క నాటుతున్న హెచ్‌ఎం ప్రసాదరావు

రాష్ట్రస్థాయి పోటీలకు పిప్పర విద్యార్థులు

గణపవరం: పిప్పర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు రాష్ట్రస్థాయిలో నిర్వహించే టేబుల్‌టెన్నిస్ పోటీలకు ఎంపికయ్యారు. సోమవారం భీమవరం ఎస్‌సీహెచ్‌బీవీఆర్‌ఎం ఉన్నత పాఠశాలలో నిర్వహించిన జిల్లా స్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలో పిప్పర పాఠశాలకు చెందిన అండర్–14 విభాగంలో యు.వరుణ్ (7వ తరగతి), అండర్–17 విభాగంలో బి.సుధీర్ (9వ తరగతి) ఎంపికైనట్లు హెచ్‌ఎం జయవెంకటేశ్వరరావు తెలిపారు. వీరు త్వరలో నంద్యాలలో నిర్వహించే రాష్ట్రస్థాయి టీటీ పోటీలో పాల్గొంటారని తెలిపారు. విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన పీఈటీ ప్రసాద్‌ను ఆయన అభినందించారు.



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

నేటి నుంచి 13 వరకు పాఠశాలలకు దసరా సెలవులు

దెందులూరు: మండలంలో ప్రభుత్వ ఎయిడెడ్, ప్రైవేటు పాఠశాలలకు రాష్ట్ర విద్యాశాఖ ఆదేశాల మేరకు ఈ నెల 3 నుంచి 13వ తేదీ వరకు సెలవులు ప్రకటించినట్టు దెందులూరు మండల విద్యాశాఖాధికారి ఏవీఎస్‌వీ ప్రసాద్ అన్నారు. బుధవారం ఎంఈఓ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల తుఫాన్‌లో పాఠశాలకు సెలవులు ఇచ్చిన దృష్ట్యా డీఈఓ, ఎంఈఓ అనుమతితో కేవలం ప్రైవేటు పాఠశాలలు తరగతులు నిర్వహించుకోవచ్చని ఎంఈఓ తెలిపారు.

సమస్యల పరిష్కారం కోసం ఉద్యమ బాట తప్పదు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యల పరిష్కారం కోసం ఉద్యమబాట తప్పదని ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షురాలు చెన్నుపాటి మంజుల స్పష్టం చేశారు. బుధవారం ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఏపీటీఎఫ్) ఏలూరు జిల్లా శాఖ ఆధ్వర్యంలో జిల్లా ఉద్యమ అధ్యయన తరగతులు స్థానిక ఈదర సుబ్బమ్మదేవి నగరపాలక ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మంజుల ఏపీటీఎఫ్ దృక్పథం– పని విధానం అనే అంశంపై మాట్లాడుతూ ఏపీటీఎఫ్ సంఘం విద్యారంగ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడుతోందన్నారు. రాష్ట్రీయ, జాతీయ, అంతర్జాతీయ పరిస్థితులు– విద్యారంగంపై ప్రభావం అనే అంశంపై రాష్ట్ర పూర్వ ప్రధాన కార్యదర్శి పీ. పాండురంగవర ప్రసాద్, ఉపాధ్యాయ ఉద్యమ చరిత్ర అనే అంశంపై రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే. భానుమూర్తి ప్రసంగించారు.ఈ అధ్యయన తరగతులకు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు టీ. రామారావు, బీ. రెడ్డి దొర, రాష్ట్ర కార్యదర్శి బీఏ సాల్మన్ రాజు, జిల్లా సబ్ కమిటీ సభ్యులు బీ.శ్యాం సుందర్, జే. సోమేశ్వర శాస్త్రి, ఎస్.దొరబాబు, ఎన్‌జేపీ నారాయణ, కేఎన్ రమాదేవి, కేఎస్ఎస్ ప్రకాష్‌రావు, వి.గణేష్, రాష్ట్ర కౌన్సిలర్లు కె.కుటుంబరావు, రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యులు ఎస్.కే రంగావలి, మండల పట్టణ శాఖల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.



ఏపీటీఎఫ్ అధ్యయన తరగతుల్లో మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ సంఘ రాష్ట్ర అధ్యక్షురాలు మంజుల

పింఛన్ పథకానికి దరఖాస్తు చేసుకోండి

ఏలూరు (టూటౌన్): రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అర్హులైన డప్పు కళాకారులు, చర్మకారులు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే పింఛన్లను అందిపుచ్చుకోవాలని రాష్ట్ర చర్మకారుల సంక్షేమ సంఘం అధ్యక్షులు, జాతీయ మాదిగ సీనియర్ నేత, డప్పు కళాకారుల సంఘం గౌరవ అధ్యక్షులు పాలిమేర హరికృష్ణ పిలుపునిచ్చారు. స్థానిక గన్‌బజారులోని సంఘ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో హరికృష్ణ మాట్లాడారు. ప్రతి చర్మకారుడు, డప్పు కళాకారుడు ఆధార్ కార్డులు పరిశీలించుకోవాలని, ఆధార్ కార్డు ప్రకారం 40 ఏళ్లు పైబడిన చర్మకారులు, 50 ఏళ్లు దాటిన డబ్బు కళాకారులు అర్హులన్నారు. పెన్షన్ దరఖాస్తుకు కులము, ఆదాయం సర్టిఫికెట్లతో పాటు, వృత్తిపరమైన ఫొటోను జతపరిచి, ఆయా ప్రాంతాల్లో ఉన్న సచివాలయంలో దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు. అనంతరం సంఘానికి సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. నిడమర్తి నాగేశ్వరావు, నారపాం కిషోర్, ఎర్ర సత్యానందం తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులు సేవలు వెలకట్టలేనివి



పారిశుద్ధ్య కార్మికులను సత్కరించిన ప్రజాప్రతినిధులు

ఉంగుటూరు: పారిశుద్ధ్య కార్మికులు సేవలు వెలకట్టలేనివని ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి అన్నారు. బుధవారం ఉంగుటూరు గ్రామ పంచాయతీ పాలక వర్గం ఆధ్వర్యంలో నిర్వహించిన గాంధీ జయంత్యుత్సవంలో ఎంపీపీ మాట్లాడారు.ఎంపీడీవో మనోజ్ మాట్లాడుతూ ఎన్ఆర్ఈజీఎస్ పనులతో గ్రామాభివృద్ధి, గ్రామస్వరాజ్యం ఏర్పడుతుందన్నారు. ప్రజలు ప్రజాప్రతినిధుల సహకారంతో పనులు పూర్తిచేసుకోవాలని సూచించారు. గాంధీ జయంతి సందర్భంగా సర్పంచి బండారు సింధు అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. ఉపసర్పంచి పాతూరి జగదీష్, వార్డు సభ్యులు, ప్రజలు పాల్గొన్నారు. ఎంపీడీవో కార్యాలయం వద్ద గాంధీ విగ్రహానికి ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి, ఎంపీడీవో పూలమాల వేసి నివాళులర్పించారు. తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ బొడ్డేపల్లి ప్రసాదు తదితరులు గాంధీ చిత్రపటానికి పూల మాలవేశారు. నారాయణపురం పంచాయతీ కార్యాలయంలో సర్పంచి దిడ్ల అలకానంద ఆధ్వర్యంలో పారిశుద్ధ్య కార్మికులను సత్కరించారు.

ఉపాధ్యాయులు విద్యార్థులకు ఆదర్శంగా నిలవాలి

గణపవరం: సమాజానికి ఉత్తమ పౌరులను అందించే గురుతర బాధ్యత ఉపాధ్యాయులపైనే ఉందని, ఉపాధ్యాయులు నిబద్ధత, అంకితభావంతో పనిచేస్తేనే ఇది సాధ్యమని పలువురు అన్నారు. బావాయిపాలెం హెచ్‌ఎంగా పనిచేసి పదవీ విరమణ చేసిన కసిరెడ్డి హరనాథ్‌ను బుధవారం పాఠశాల సిబ్బంది, గణపవరం, నిడమర్రు మండలాల ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభకు హెచ్‌ఎం కెవి కృష్ణకుమార్ అధ్యక్షత వహించారు. చిత్తశుద్ధితో విధులు నిర్వహించే ఉపాధ్యాయులు విద్యార్థులకు ఆదర్శంగా నిలుస్తారని, దీనికి హరనాథ్ ఉదాహరణ అని గణపవరం నిడమర్రు ఎంఈవోలు పుచ్చల శేషు, గొర్రెల బాలయ్య అన్నారు. రిటైర్డ్ ఎంఈవోలు కె.రాంబాబు, వంగపండు నర్సింహమూర్తి తదితరులు హరనాథ్ సేవలను కొనియాడారు. పలువురు ఉపాధ్యాయులు హరనాథ్ దంపతులను పూలమాలలతో దుశ్శాలువలతో సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. నిడమర్రు మండల ఉపాధ్యక్షుడు సమయం వీరరాఘవులు, వైఎస్సార్‌సీపీ, కూటమి నాయకులు, ఎస్టీయూ, యూటీఎఫ్, ఏపీటీఎఫ్ ఉపాధ్యాయ సంఘాల నాయకులు, పూర్వవిద్యార్థులు, పలువురు మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగుకు అందని పంట సాయం

- పంటకు గిట్టుబాటు ధర రాక రైతులకు ఆర్థికంగా నష్టం
- టన్ను గెలలకు ధర రూ.18 వేలు అమలు చేయాలని డిమాండ్

దెందులూరు: రైతులకు ఎన్నికల ముందు పంట సాయం అందిస్తానని ప్రకటించిన కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన అనంతరం ఆ హామీని తుంగలోకి తొక్కింది. పంట సాగు పనులు ప్రారంభమై రెండు నెలలు కావస్తున్నా, ఆ ఊసే ఎత్తడం లేదని నియోజకవర్గంలో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దెందులూరు నియోజకవర్గం పూర్తిగా వ్యవసాయ ఆధారిత ప్రాంతం. కనీసం ఆయిల్‌పామ్ పంటకు అయినా తెలంగాణ రాష్ట్రంలో మాదిరిగా గిట్టుబాటు ధర కల్పించాలని దెందులూరు నియోజకవర్గ పామాయిల్ రైతులు డిమాండ్ చేస్తున్నారు. నియోజకవర్గంలో 31 వేలకు పైగా ఆయిల్‌పామ్ సాగవుతుంది. 18,200 మంది రైతులు సాగు చేస్తున్నారు. ఆయిల్‌పామ్ టన్ను గెలలకు ధర తెలంగాణలో కన్నా ఆంధ్రాలో తక్కువగా ఉండటం వల్ల మన రాష్ట్ర రైతులు నష్టపోతున్నారు. టన్ను ఆయిల్‌పామ్ గెలల ఉత్పత్తికి రైతుకు రూ. 18 వేలు ఖర్చు అవుతుంటే సెప్టెంబరులో టన్ను గెలకు ధర రూ.14,590, ఆగస్టులో ధర రూ.13,883 మాత్రమే రైతుకు ధర వచ్చింది. అక్టోబర్‌లో తెలంగాణలో ధర రూ.17,040 పలుకుతుంటే ఇప్పటి వరకు ఆంధ్రాలో ధరపై స్పష్టత లేకపోవడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. ఆయిల్‌పామ్ కంపెనీలు ఇష్టారాజ్యంగా తయారయ్యాయని రైతులు ఆరోపిస్తున్నారు.పెదవేగిలో ఆయిల్‌ఫెడ్ కర్మాగారం ఉన్నప్పటికీ నియోజకవర్గంలోని రైతులు నష్టపోవడం బాధాకరమని పలువురు అంటున్నారు. ముడి పామాయిల్ దిగుమతి సుంకాన్ని కేంద్ర ప్రభుత్వం పెంచిన ఫలితంగా ఆయిల్‌పామ్ గెలలకు ధర పెరగడం లేదని అధికారులు అంటున్నారు. టన్ను ధర రూ.18 వేలు అమలయ్యేలా ప్రభుత్వాలు యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు. తెలంగాణ రాష్ట్రం మాదిరిగా ఆంధ్రా రైతులకు ఫ్యాక్టరీల నుంచి రవాణా చార్జీలు ఇప్పించాలని ఫ్రూట్స్ తోలిన వారం రోజుల్లో పేమెంట్ చెల్లించాలని రైతులు కోరుతున్నారు.



పెదవేగిలోని ఆయిల్‌పామ్ తోట

ఆయిల్‌ఫెడ్ కర్మాగారాన్ని అభివృద్ధి చేయాలి



పెదవేగిలోని ఆయిల్ ఫెడ్ కర్మాగారాన్ని మరింత అభివృద్ధి చేయాలి. ఉద్యానవన శాఖ ద్వారా రైతులకు అందించాల్సిన సబ్సిడీ ఇవ్వాలి. రైతులకు మేలు జరిగేలా ప్రభుత్వాలు క్షేత్రస్థాయి పరిస్థితులకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకోవాలి.

– అప్పన ప్రసాద్, ఏఎంసీ మాజీ చైర్మన్

రైతులు సంఘటితం కావాలి



రైతులు వ్యవసాయ అభివృద్ధి సమస్యల పరిష్కారం ఏకైక లక్ష్యం కావాలి. రాజకీయాలకు అతీతంగా రైతులు తమ ప్రయోజనాలకోసం పోరాడాలి. రైతులందరూ రాజకీయాలు పక్కనపెట్టి సంఘటితమైతే అన్ని పరిస్థితులు ఏకకాలంలో పరిష్కారమవుతాయి. ప్రభుత్వాలు రైతు సమస్యల వైపు చూస్తారు.

– కే.శ్రీనివాసరావు, కౌలురైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఏలూరు జిల్లా కార్యదర్శి భజంత్రీ శ్రీనివాసరావు

ఏలూరు (టూటౌన్): అపరిష్కృతంగా ఉన్న మున్సిపల్ వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ఏలూరు జిల్లా కార్యదర్శి భజంత్రీ శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ముఖ్య కార్యకర్తల సమావేశం ఏఐటీయూసీ జిల్లా కార్యాలయంలో ఏలూరు నగర యూనియన్ అధ్యక్షుడు యలగాడ దుర్గారావు అధ్యక్షతన సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న భజంత్రీ శ్రీనివాసరావు మాట్లాడుతూ పర్మనెంట్ కార్మికులకు జనరల్ ఇంక్రిమెంట్లు ఇవ్వాలని, మెడికల్ లీవ్ బిల్లులు చెల్లించాలన్నారు. ఔట్‌సోర్సింగ్ కార్మికులకు హెల్త్ అలవెన్స్ బకాయిలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఈ నెలలో జిల్లా జనరల్ బాడీ ఏలూరు నగరంలో నిర్వహించాలని సమావేశం తీర్మానించింది. ఈ సమావేశంలో యలగాడ శివకుమార్, కాకాని సుబ్బారావు, అంత రాజ్ కిరణ్, శరంశెట్టి సురేష్ పాల్గొన్నారు.